సాక్షి
జోగుళాంబ గద్వాల

బుధవారం । 14 । మే । 2025



తపాలా సేవలు..

తపాలా సేవలు పొందడంలో ఉమ్మడి జిల్లా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు 8లో ▸



అంజన్న బ్రహ్మోత్సవాలు

బీచుపల్లిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.1 /22.1

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

- 78 మంది విద్యార్థులు గైర్హాజరు

గద్వాల టౌన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,780 మంది విద్యార్థులకు గాను 1,702 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 78 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 95.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఉదయం 9 గంటల వరకే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. పది గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతి ఇచ్చారు. నిమిషం నిబంధన ఉండటంతో పలువురు విద్యార్థులు చివరి నిమిషంలో ఉరుకులు, పరుగులు తీశారు. ఆయా కేంద్రాలలో ఒక్కో బెంచీకి ఒక్కరే విద్యార్థి పరీక్ష రాసే విధంగా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల దగ్గర గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. రెవెన్యూ, వైద్య, పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. పరీక్ష పూర్తయిన తరువాత బందోబస్తు మధ్య పరీక్ష పేపర్లను వాహనాలలో తరలించారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

గద్వాల: అక్రమ లేఅవుట్లను 25శాతం రాయితీతో క్రమబద్ధీకరించేందుకు ఎల్‌ఆర్‌ఎస్ గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడగించినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 47,063 దరఖాస్తులు రాగా వాటిలో 25,710 మందికి 25 శాతం రాయితీతో కూడిన ఎల్‌ఆర్‌ఎస్ సమాచారాన్ని పంపినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో 14,313 మందికి, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 11, 397 మందికి సమాచారాన్ని పంపగా వీరిలో కేవలం 6165 మంది మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


18న చెస్ పోటీలు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 18న జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 9, 11 బాలలకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు పోటీలు జరుగుతాయని.. మొదటి, రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల బాలలు పోటీలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంఘం జిల్లా అధ్యక్షుడు (సెల్‌నంబర్ 97034 62115), కోశాధికారి టీపీ కృష్ణయ్య (సెల్‌నంబర్ 99591 54743) సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

కేటీదొడ్డి: కర్ణాటక రాష్ట్రం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు దృష్టి సారించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపురం గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటకు రాష్ట్రం నుంచి వచ్చే రైతులకే ముందుగా టోకన్లు ఇస్తున్నారని ఇక్కడి నెలల నుంచి ఉన్న రైతులకు టోకెన్లు, గన్నీ బ్యాగ్స్ ఇవ్వడం లేదని ఆయన అడిషనల్ కలెక్టర్ నర్సింగ్‌రావుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. తూకంలో తరుగులు ఎక్కువ తీస్తున్నారని అవకతవకలు జరుగకుండా చూడాలని అన్నారు. ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి వారికి కేటాయించిన రైస్ మిల్లులకు తనలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్వప్న, మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, నాయకులు హనిమిరెడ్డి, ఎర్రభీంరెడ్డి, శ్రీనివాసులు, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5,640



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు మంగళవారం 146 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.5640, కనిష్ఠం రూ.2840, సరాసరి రూ.4470 ధరలు పలికాయి. అలాగే, 42 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్ఠం రూ.5820, కనిష్ఠం రూ.4590, సరాసరి రూ.5712 ధరలు లభించాయి. 621 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ.1856, కనిష్ఠం రూ. 1509, సరాసరి రూ.1769 ధరలు వచ్చాయి.



'సెట్' రైట్..!

తొలిసారిగా 'టీజీ పీఈసెట్' బాధ్యతల అప్పగింత

- ఎట్టకేలకు పీయూకు లభించిన సదావకాశం
- డీపెడ్, బీపెడ్ కోర్సుల్లో సీట్ల కేటాయింపు కోసం ఈవెంట్ల నిర్వహణ
- హాజరుకానున్న రాష్ట్రంలోని 9 యూనివర్సిటీల పరిధిలోని విద్యార్థులు
- పకడ్బందీగా చేపట్టేందుకు అధికారుల కసరత్తు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎట్టకేలకు పాలమూరు యూనివర్సిటీకి ఒక కామన్ ఎంట్రెన్స్ టెస్టు (సెట్) నిర్వహించే అవకాశం లభించింది. పీయూ వీసీ శ్రీనివాస్ ఉన్నత విద్యా మండలికి పలుమార్లు విజ్ఞప్తి చేయగా.. మొట్టమొదటిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ (వ్యాయామ విద్య) కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యత అప్పగించారు. దీంతో 2025- 26 విద్యా సంవత్సరానికి టీజీ పీఈసెట్ (తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు) నిర్వహించేందుకు పీయూ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పీయూ వీసీ శ్రీనివాస్, సెట్ కన్వీనర్ దిలీప్ సెట్ నిర్వహణకు సంబంధించి పీయూలో ఉన్న వసతులు, సింథటిక్ ట్రాక్, గ్రౌండ్, ఇండోర్ స్టేడియాలను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 9 యూనివర్సిటీ పరిధిలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు బీపెడ్ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్), డిగ్రీ పూర్తయ్యాక డీపెడ్ (డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్) కోర్సులలో ప్రవేశాలు పొందేందుకు పీయూ ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ఈ కోర్సులకు సంబంధించి ఎలాంటి పరీక్ష లేకుండా కేవలం విద్యార్థులు క్రీడా ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు. దీంతో మొత్తం 15 క్రీడా ఈవెంట్ల నిర్వహణకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

11 ఈవెంట్లు.. 500 మార్కులు

తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (టీజీ పీఈసెట్) దరఖాస్తులకు ఈ నెల 25 చివరి తేదీ కాగా.. వచ్చే నెల 11 నుంచి 15 వరకు పీయూలో పలు ఈవెంట్లు నిర్వహించనున్నారు. మొత్తంగా 500 మార్కులు ఉంటాయి. బాలురకు 100, 800 మీటర్లు, షాట్‌పుట్ (6 కేజీలు), లాంగ్ జంప్, హైజంప్‌లో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంది. ఇందులో ప్రతి ఈవెంట్‌కు 100 మార్కుల చొప్పున కేటాయిస్తారు. అలాగే బాలికలకు 100, 400 మీటర్లు, షాట్‌పుట్ (4 కేజీలు), లాంగ్‌జంప్ లేదా హైజంప్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. మొత్తంగా 11 ఈవెంట్‌లలో విద్యార్థులకు ఆప్షన్‌గా కేటాయించనున్నారు. ఒక క్రీడను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇందులో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, లాన్‌టెన్నీస్, వాలీబాల్ ఉన్నాయి. ఇందులో ఏదో ఒక ఈవెంట్‌లో విద్యార్థులు పాల్గొనాలి. ఈవెంట్‌కు 70, గతంలో సంబంధిత ఈవెంట్‌లో పాల్గొన్న సర్టిఫికెట్ ఉంటే 30 మార్కులు కేటాయిస్తారు.

గొప్ప విషయం..

టీజీ పీఈసెట్ నిర్వహణ బాధ్యత పీయూకు ఇవ్వడం గొప్ప విషయం. పీయూలో ప్రవేశ పరీక్ష నిర్వహణకు సింథటిక్ ట్రాక్, గ్రౌండ్, ఇండోర్ స్టేడియం వంటి అన్ని వసతులు ఉన్నాయి. ఈవెంట్లకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం. ప్రవేశ పరీక్ష పారదర్శకంగా.. పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీనివాస్, పీయూ వైస్‌చాన్స్‌లర్

లోటుపాట్లు లేకుండా..

రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో డీపెడ్, బీపెడ్ కోర్సులలో సీట్లు కేటాయించేందుకు నిర్వహించే సెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే నెల 11 నుంచి 14 వరకు పీయూ వేదికగా ఈవెంట్ నిర్వహించి విద్యార్థులకు ర్యాంకులు కేటాయించనున్నాం. ఇందులో ఎలాంటి లోటుపాట్లు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తాం. పీయూలో సెట్ నిర్వహణకు అన్ని వసతులు ఉన్నాయి. వేల సంఖ్యలో విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది.

– దిలీప్, టీజీ పీఈసెట్ కన్వీనర్

పకడ్బందీగా ఏర్పాట్లు

క్రీడా ఈవెంట్లకు రాష్ట్రవ్యాప్తంగా 4–5 వేల మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలుస్తుంది. వచ్చే విద్యార్థులకు వసతులు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోనున్నారు. మార్కుల కేటాయింపుల విషయంలో ఇందుకు నియమించిన కమిటీకే పూర్తిస్థాయి అధికారం ఉంటుంది. మార్కుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా వీడియో, ఫొటో కెమెరాల ద్వారా ఈవెంట్ రికార్డు చేయనున్నారు. వీటి ద్వారా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సెట్ కన్వీనర్ దిలీప్ పేర్కొన్నారు. మొత్తంగా 11 ఈవెంట్లతోపాటు 4 అథ్లెటిక్ ఈవెంట్‌లకు సంబంధించి పీయూలో పూర్తిస్థాయిలో గ్రౌండ్లు సిద్ధం చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



పీయూలో బాస్కెట్‌బాల్ కోర్టును పరిశీలిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, సెట్ కన్వీనర్ దిలీప్, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్

మన్యంకొండలో వైభవంగా వసంతోత్సవం



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయరు దేవస్థానం సమీపంలో మహబూబ్‌నగర్– రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కనున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి (ఓబులేశు) ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవబృత స్నానం తదితర పూజలు జరిపి.. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొన్నారు. అనంతరం పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. స్వామివారి పాదాలు, శఠగోపురానికి పురోహితులు సంప్రదాయబద్ధంగా స్నానం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రత్యేక పూజలు



అలంపూర్: అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబ ఆలయాన్ని హైదరాబాద్‌లోని కోఠి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సూర్య ధనాంజయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ పురేందర్, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వద్దు



కొత్తపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ

గద్వాల: రైస్‌మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకోవడంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గద్వాల మండలం కొత్తపల్లి, రేకులపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రాలలోని ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత మిల్లులకు తరలించడంతో పాటు తక్షణమే మిల్లుల వద్ద అన్‌లోడింగ్ జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అక్కడే రైతులను పలుకరించి ధాన్యం అమ్మకాలలో ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాలలో సేకరించిన ధాన్యం నిల్వల గురించి, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం తరలింపు, రైస్‌మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీబ్యాగుల కొరత, హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. అకాలవర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోకుండా సరిపడా సంఖ్యలో టార్పాలిన్లు సమకూర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మల్లిఖార్జున్, డీటీ అజిత్‌కుమార్, ఆర్‌ఐ రామకృష్ణ, ఏఈవో హరీష్, డీపీఎం రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి సదస్సులను వినియోగించుకోండి



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఇటిక్యాల: రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో ప్రజలు అధికారులను కలవాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులే గ్రామాల్లోకి వచ్చి నేరుగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. రైతులు నిర్దేశిత ప్రొఫార్మా ద్వారా దరఖాస్తులను ఇవ్వాలని సూచించారు. ఈ సదస్సులో భూ రికార్డుల సవరణలు, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదాబైనామాలు, సర్వే నెంబర్ గల్లంతు, పట్టాదారు పాస్‌బుక్‌జారీ కాకపోవడం వంటి అంశాలు పరిష్కరించబడతాయని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేష్, డి టి నందిని, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యాలు, నైపుణ్యాల పెంపే లక్ష్యం



శిక్షణలో మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ రమేష్

గద్వాలటౌన్ : మారుతున్న లక్ష్యాలకు అనుగుణంగా బోధన సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అన్నిస్థాయిల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాలను చేపట్టిందని జిల్లా విద్యా సమన్వయ అధికారిణి ఎస్తేరురాణి అన్నారు. మంగళవారం వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు వేరువేరుగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వారికి ఆయా సబ్జెక్టుల నిపుణులతో శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన ఫలితాలను పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు బీకే రమేష్, అమీర్ బాష, వెంకటనర్సయ్య, అంపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సబ్ జూనియర్ నెట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో మంగళవారం సబ్ జూనియర్ ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సంబంధించి వేర్వేరుగా బాల, బాలికల నెట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జనగాంలో ఈనెల 15 నుంచి 18 వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్లు ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో ఖాజాఖాన్, అంజద్‌అలీ, షరీఫ్, షకీల్, అక్రం, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల కోసం వేలల్లో దరఖాస్తులు

- ఇప్పటికే మొదలైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు
- ప్రభుత్వం, బ్యాంకుల షరతులతో లబ్ధిదారుల్లో అయోమయం
- వివిధ రకాల కారణాలతో నెలల తరబడి కాలయాపన

పథకాలపై ఆశలు..



సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఆశావహులు పెద్దసంఖ్యలో ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంతోపాటు ప్రత్యేకంగా రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఇవ్వడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఎంపిక ప్రక్రియ పేరుతో నెలల తరబడి కాలయాపన చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం సకాలంలో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హులైన పేదలకు పథకాలను వర్తింపజేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

బ్యాంకులపైనే భారం..

రాజీవ్ యువవికాసం కింద నిరుద్యోగ యువతకు జీవనోపాధి కోసం సబ్సిడీతో కూడిన రుణాన్ని ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో రూ.50 వేల యూనిట్‌ను పూర్తి సబ్సిడీతో ఇవ్వనుండగా.. రూ.4 లక్షల వరకు రుణాలను కేటగిరీని బట్టి 70 శాతం వరకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించనున్నారు. ఇప్పటికే భారీస్థాయిలో అందిన దరఖాస్తుల పరిశీలన, వడబోత ప్రక్రియ కొనసాగుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులతోపాటు సంబంధిత బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. అయితే ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా బ్యాంకుల 'గ్యారంటీ'పైనే ఆధారపడినట్టు కనిపిస్తోంది. లబ్ధిదారునికి యూనిట్ మంజూరుపై బ్యాంకు అధికారులు అంగీకరిస్తేనే సబ్సిడీ రుణం అందనుంది.

ఉమ్మడి జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తులు

జిల్లా	బీసీ	ఎస్సీ	ఎస్టీ	మైనార్టీ
మహబూబ్‌నగర్	14,888	4,790	3,513	3,380
నాగర్‌కర్నూల్	18,577	7,300	4,300	1,450
వనపర్తి	10,546	3,882	1,547	1,385
జోగుళాంబ గద్వాల	12,427	8,374	399	3,262
నారాయణపేట	9,294	3,483	1,037	1,666

ఉమ్మడి జిల్లాలో తొలివిడత కింద పరిశీలించిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు

మహబూబ్‌నగర్ 39,321	నాగర్‌కర్నూల్ 42,566
వనపర్తి 26,894	జోగుళాంబ గద్వాల 35,351
నారాయణపేట 29,450	

దక్కేది కొందరికే..

ఉమ్మడి జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా.. ప్రభుత్వం మాత్రం లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులకు పరిమితమైన లక్ష్యాలను నిర్దేశించింది. ఒక జిల్లాలో కార్పొరేషన్‌కు 15 వేల వరకు దరఖాస్తులు వస్తే ప్రభుత్వం మాత్రం 4 వేలలోపు మందికే రుణాలు మంజూరు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. యూనిట్ల ఎంపిక, దరఖాస్తుదారుల సామర్థ్యం, యూనిట్ ఏర్పాటు చేయగల అవకాశాలు పరిగణలోకి తీసుకున్నాకే బ్యాంకులు మంజూరుకు ఆమోదం తెలపనున్నాయి.

విడతల వారీగా ఇళ్లు..

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఒక్కో జిల్లాలో ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మొదటి దఫాలో ఇల్లు లేనివారు, గుడిసె, రేకుల ఇంట్లో నివశిస్తున్న వారికి అవకాశం ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు. రెండో కేటగిరీలో పక్కా ఇల్లు లేని వారు, సొంత జాగా లేని పేదలకు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. గ్రామాలు, మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఎంపీడీఓలు పూర్తిచేస్తారు. ఆ తర్వాత కలెక్టర్ లబ్ధిదారుల ఎంపికను పరిశీలిస్తారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పర్యవేక్షణలో తుది జాబితా రూపుదిద్దుకోనుంది. ఇందుకు మరిన్ని రోజుల సమయం పడుతుందని తెలుస్తోంది.

అర్హులకు అందించాలి..



రాజీవ్ యువవికాసం కింద ఫొటోస్టూడియో ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం జీవనోపాధికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించి సకాలంలో సబ్సిడీ రుణాలను అందజేయాలి.

– రాజశేఖర్, మన్ననూర్, అమ్రాబాద్ మండలం

పరిశీలన కొనసాగుతోంది..

రాజీవ్‌యువ వికాసం కింద వచ్చిన మొత్తం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారులతోపాటు బ్యాంకు అధికారులు సమగ్రంగా దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు. బ్యాంకుల పరిశీలన పూర్తయిన తర్వాత ఆమోదం పొందిన వాటిని జిల్లా స్థాయి కమిటీకి పంపిస్తారు. తర్వాత లబ్ధిదారుల జాబితా విడుదల చేస్తాం.

– ఖాజా నిజాం అలీ, బీసీ సంక్షేమ శాఖాధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడి దుర్మరణం


అబ్దుల్ రఫీక్ మృతదేహం

మహబూబ్‌నగర్ క్రైం: లారీ ఢీకొట్టడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య తెలిపిన వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్టకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహ్మద్ అబ్దుల్ రఫీక్ (52) మంగళవారం సాయంత్రం జేపీఎన్‌సీఈలో శిక్షణ ఉండడంతో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో వన్‌టౌన్ చౌరస్తాలో బైక్‌ను రాయచూర్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రఫీక్‌కు తీవ్ర గాయాలై స్పాట్‌లోనే మరణించాడు. మృతుడి భార్య నహీద బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికుడి బలవన్మరణం

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: ఓవైపు అప్పులబాధ, మరోవైపు అనారోగ్య సమస్యలతో మున్సిపల్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. జడ్చర్ల వెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న చెన్నకేశవులు (38) స్థానిక మున్సిపాలిటీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. చేసిన అప్పులను తీర్చేందుకు గాను ఇటీవల మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ. 4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ప్రతినెలా కిస్తీ కట్టాల్సి ఉండగా.. మొదటి నెల మాత్రమే కట్టాడు. తర్వాత అతడు అనారోగ్యానికి గురికావడంతో తర్వాతి కిస్తీలు కట్టలేకపోయాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ వారి నుంచి ఒత్తిడి రావడంతో పాటు అనారోగ్య సమస్యలు వెంటాడాయి. వీటితో మానసిక ఆందోళనకు గురైన అతడు.. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మాధురి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం మున్సిపాలిటీ తరఫున రూ. 30వేలు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన ఉపేందర్ (23) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వాడు. అతడు మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని లాడ్జీలో రూం అద్దెకు తీసుకొని అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన లాడ్జీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

అచ్చంపేట రూరల్: మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలోని పీర్లబావిలో మంగళవారం గుర్తు తెలియని యువకుడి శవం లభ్యమైంది. విధుల్లో భాగంగా పంచాయతీ కార్మికుడు పరమేశ్వర్ బావి దగ్గర చూడగా శవం ఉన్నట్లు గుర్తించి పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులుకు సమాచారం ఇచ్చాడు. అతను సిద్దాపూర్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు శవాన్ని బయటకు తీశారు. మృతుడు కాఫీ రంగు టీ షర్ట్, సిమెంట్ రంగు ఫార్మల్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వయసు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. కుడి చేతిపై వి.అనిత 143 అనే టాటూ ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బస్టాండ్‌లో భారీ చోరీ

మాగనూర్ (మక్తల్): మక్తల్ బస్టాండ్‌లో మంగళవారం ఉదయం భారీ దొంగతనం జరిగింది. మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి వివరాల ప్రకారం.. మక్తల్ పట్టణం నేతాజీ నగర్‌కు చెందిన ఉప్పరి మహేశ్వరి ఆశ కార్యకర్తగా పని చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం యాదిగిరి జిల్లాలో నివాసముంటున్న చెల్లెలు అవసరం నిమిత్తం సరస్వతి మహిళా సంఘంలో రూ.3.50 లక్షలు లోనుగా తీసుకొని యాదగిరి వెళ్లడానికి మక్తల్ బస్టాండ్‌కు వచ్చారు. రాయచూర్ బస్సు ఎక్కి మాగనూర్ సమీపంలో బ్యాగును చూసుకోగా డబ్బు కనిపించలేదు. వెంటనే మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

జడ్చర్ల: పట్టణంలోని సాయినగర్ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లారు. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. ఏపీలోని కృష్ణా జిల్లా రాఘవపురానికి చెందిన రామకృష్ణారెడ్డి ఉద్యోగం రీత్యా జడ్చర్లలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 10న కుటుంబసభ్యులతో కలసి సొంతూరుకు వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బీరువాలో దాచిన మూడు తులాల బంగారు నగలతో పాటు 20 తలాల వెండి కొంత నగదు చోరీకి గురి కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తపాలా సేవలు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు



వనపర్తి తపాలా ప్రధాన కార్యాలయం

- నాలుగు కలెక్టరేట్‌ల పరిధిలోకి వనపర్తి తపాలా కార్యాలయం
- జిల్లాలు ఏర్పడి తొమ్మిదేళ్లు కావొస్తున్న పరిస్థితిలో రాని మార్పు
- ప్రభుత్వం అభ్యర్థిస్తేనే మిగతా జిల్లాలకు ప్రయోజనం

వనపర్తిటౌన్: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించింది. ప్రతి జిల్లాలో కలెక్టరేట్ పరిధి ఆ జిల్లా వరకే పరిమితమై ఉంటుంది. కానీ తపాలా శాఖ అందుకు భిన్నంగా ఉండటంతో ప్రజలకు రవాణ కష్టాలు, వ్యయప్రయాసలు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఐఏఎస్ క్యాడర్ అధికారులతో జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఉన్నా తపాలా శాఖ మాత్రం యథాతథంగానే కొనసాగుతుంది. వనపర్తి తపాలా ప్రధాన కార్యాలయం పరిధి నాలుగు జిల్లాల్లో విస్తరించి హైదరాబాద్ చేరువ వరకు సేవలందిస్తోంది. నాలుగు జిల్లాలకు వనపర్తి కేంద్ర కార్యాలయంగా సేవలు అందిస్తోంది. వనపర్తి జిల్లాతో పాటుగా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలోని 20 మండలాలతో పాటు మిగతా నాలుగు జిల్లాలకు వనపర్తి కేంద్రంగా తపాలా సేవలు అందుతున్నాయి. జిల్లాల పునర్విభజన కంటే ముందు ప్రతి జిల్లాలో రెండు ప్రధాన తపాలా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే అప్పట్లో ఒకటి వనపర్తిలో ఉంటే, మరొకటి మహబూబ్‌నగర్‌లో ఉండేది. ఈ రెండు కార్యాలయాల ద్వారానే అవిభక్త మహబూబ్‌నగర్ జిల్లా అంతటా రంగారెడ్డి ప్రాంతంలోని పలు ప్రాంతాల దాకా తపాల శాఖ తన సేవలను అందించేది.

2016 నుంచి మారిన సీన్

2016 అక్టోబర్ 11వ తేదీన కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలతో కొలువుదీరిన సంగతి తెలిసిందే. అయితే తపాలా కార్యాలయం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో విభజించిన జిల్లాలకు అనుగుణంగా తపాలా కార్యాలయం పరిధిని మార్చలేదు. ఫలితంగా తపాలా కార్యాలయం పరిధి అలాగే కొనసాగుతుంది. విభజించిన జిల్లాలకు కలెక్టర్‌లను కేటాయిస్తున్నప్పుడు తపాలాను జిల్లాకు అనుగుణంగా విభజించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించాల్సి ఉంది. ఆ దిశగా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. జిల్లాలు ఏర్పాటు అయినప్పటి నుంచి ఇదే పరిస్థితి నెలకొనడంతో తపాలా ప్రధాన కార్యాలయాల పరిధిలో మార్పు కనిపించలేదు. ఇంతకు ముందు రెండు ప్రధాన తపాలా కార్యాలయాల పరిధిలో ఒక జిల్లా కలెక్టర్ ఉంటే ప్రస్తుతం నాలుగు జిల్లాల కలెక్టర్‌ల పరిధిలో వనపర్తి ప్రధాన తపాలా కార్యాలయం కొనసాగుతుండటం గమనార్హం. వనపర్తిలో విధులు నిర్వర్తించే ప్రధాన పోస్టల్ సూపరింటెండెంట్‌కు ఏ జిల్లాలో కలెక్టర్ మీటింగ్ పెడితే అక్కడకు పరుగెత్తాల్సి వస్తోంది. ఈ క్రమంలో అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్‌లు మారినప్పుడు మర్యాద పూర్వకంగా కలిసేందుకు, సమీక్షలకు హాజరయ్యేందుకు అన్ని జిల్లాలకు వెళ్లాల్సిందే. ఒకవేళ తపాలా ఉన్నతాధికారుల విజిట్ వల్ల హాజరు కాకపోతే మరుసటి రోజు వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది.

తప్పని భారం

వనపర్తి తపాలా పరిధి నాలుగు జిల్లాలలో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ఆయా జిల్లాల పరిధిలో ప్రత్యేక పరిస్థితుల వల్ల అధికారుల్లోనూ ఒత్తిడి నెలకొంది. ఏదైనా తీరని సమస్యను పరిష్కరించుకునేందుకు ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ విషయంలో తేడాలు ఇలా ఏ సమస్య ఎదురైన ప్రజలు వనపర్తి ప్రధాన కార్యాలయానికి రావడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అధికారులు అందుబాటులో ఉండకపోవడం, మరుసటి రోజు వరకు నిరీక్షణ చేయాల్సి వస్తుంది. రంగారెడ్డి, అమ్రాబాద్, బాల్‌నగర్‌లతో పాటుగా ఇతర జిల్లాలలోని మండలాల ప్రజలు వనపర్తికి వచ్చేందుకు జంకుతున్నారు. ప్రస్తుత జిల్లాలకు అనుగుణంగా తపాలా శాఖ సేవలను విస్తరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పరిధి 200 కిలోమీటర్లు

వనపర్తి జిల్లా పరిధి 30 కిలోమీటర్ల లోపు ఉంటే తపాలా పరిధి సుమారు 200 కిలోమీటర్ల వరకు ఉంది. శ్రీశైలం డ్యాం చివరి డెడ్‌లైన్ వరకు చేవేళ్ల దాకా ఉంది. ఈ తపాలా పరిధిలో సేవింగ్, ఆర్డీ, ఎస్ఎస్ఏ, ఎంఐఎస్, పీపీఎఫ్ ఇలా తదితర ఖాతాలు కలిపి 371,107 మంది వినియోగదారులు ఉన్నారు. ఇందుకు గాను 398 బ్రాంచి పోస్టాఫీసులు, 38 సబ్ పోస్టాఫీస్‌లో కలిపి సుమారుగా 600 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

మా పరిధి నాలుగు జిల్లాలే..



వనపర్తి జిల్లాతో పాటుగా వనపర్తి తపాలా కార్యాలయం మిగతా మూడు జిల్లాలోనూ సేవలు అందిస్తోంది. జడ్చర్లలోని ఏఎస్పీ, సబ్ డివిజనల్ ఆఫీసర్‌లు వారి సమీపంలోని కార్యాలయాలను పర్యవేక్షిస్తారు. నేను మా పరిధిలోని కార్యాలయాలంటినీ తరచుగా విజిట్ చేసి వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం. కార్యాలయాల పరిధిని కుదిస్తే ప్రజలకు సత్వర సేవలు అందించవచ్చు.

– భూమన్న, వనపర్తి తపాలా అధికారి

రాష్ట్రస్థాయి ఉద్యాన పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర సైదయ్య, శాస్త్రవేత్తలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మోజెర్ల గ్రామంలోని ఉద్యాన కళాశాల వేదికగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని 4 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మే 13 నుంచి 14 వరకు రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర అంతర్ కళాశాలల ఆటల పోటీలలో కరీంనగర్ జిల్లా రామగిరి ఖిల్లా, ఆదిలాబాద్‌లోని దస్నాపూర్, నల్గొండలోని గడ్డిపల్లి, కొల్లాపూర్‌లోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల టీంలు పాల్గొన్నాయి. పోటీలను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య ప్రారంభించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలంటే చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఇందుకోసమే యూనివర్సిటీలో పరిధిలోని అన్ని కళాశాలల్లో చదువుతో పాటు క్రీడలకు సైతం సమాన ప్రాతినిధ్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామగిరి ఖిల్లా ఉద్యాన పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి నవీన్ కుమార్, గడ్డిపల్లి గంట గోపాల్ రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ నరేష్ గౌడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

- 680 గ్రాముల గంజాయి స్వాధీనం



గద్వాల క్రైం: గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గద్వాల పట్టణం చింతలపేట కాలనీకి చెందిన బషీర్ కొన్ని రోజుల నుంచి హైదరాబాద్(దూల్‌పేట), మహారాష్ట్రలోని షోలాపూర్ కేంద్రంగా గంజాయి కొనుగోలు చేసి పట్టణంలోని కార్మికులకు 1 గ్రాము రూ.500 చొప్పున్న విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచి ఆరా తీయగా గద్వాలకు చెందిన యువకుడిగా తెలిసిందన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గంజాయి విక్రయించేందుకు రాగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి 680 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోగా, దాని విలువ రూ.27వేలు ఉంటుందన్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసి అలంపూర్ కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్‌గా పనిచేస్తూ అక్రమంగా డబ్బులు సంపదించాలనే అత్యాశతో నిషేధిత మత్తు పదార్థాల దందాకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్‌ఐ తరుణ్‌కుమార్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సవరన్న, సిబ్బంది కిరణ్, చంద్రయ్య, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండపేటలో వాహన తనిఖీలు

ఊర్కొండ: మండల పరిధిలోని ఊర్కొండపేట ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ తదితర పత్రాలను పరిశీలించిన సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ నాగార్జున హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణదేవ, మహేందర్,కురుమూర్తి, శంషోద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలు

పంట కాల్వలను పరిశీలించిన అధికారులు


పంట కాల్వలను పరిశీలిస్తున్న ఆర్డీఎస్ ఎస్ఈ రహముద్దీన్

అయిజ: పంట కాల్వలతో పొలం మునిగిపోతుందని, సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని రైతు అనంతరెడ్డి గతంలో లోకాయుక్తను ఆశ్రయించారు. విచారణ చేపట్టేందుకు మంగళవారం లోకాయుక్త దర్యాప్తు అధికారి మాథ్యూ కోశీ, నెట్టెంపాడు ప్రాజెక్ట్ ఎస్ఈ రహముద్దీన్ తూంకుంటకు చేరుకున్నారు. నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామ సమీపంలో నిర్మించిన 106 ప్యాకేజీ కాల్వలను పరిశీలించారు. బాధితుడితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల పొలాల రైతులను విచారించారు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ఫీటు కాల్వలను రైతులు పూడ్చివేయడంతో సమస్య ఏర్పడిందని.. బాధితుడు తమ పొలంలోని కాల్వకు ఇరువైపులా ఉన్న కట్టలను చదును చేయడంతో సమస్య మరింత జఠిలమైందని నిర్ధారణకు వచ్చారు. మైనర్ కాల్వను ముందుకు కొనసాగించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఇందుకు రైతులు సంతకాలు చేసి నెట్టెంపాడు ప్రాజెక్ట్ అధికారులకు ఇవ్వాలని ఎస్ఈ రహముద్దీన్ సూచించారు. విచారణ అంశాలను లోకాయుక్తకు అందజేస్తానని దర్యాప్తు అధికారి మాథ్యూ కోశీ పేర్కొన్నారు.

తల్లి ఒడిలోనే ప్రాణాలొదిలింది

- కారు, డీసీఎం ఢీ.. ఇనుప సీకులు గుచ్చుకొని చిన్నారి మృతి
- తల్లిదండ్రుల పరిస్థితి విషమం


తేజశ్రీ మృతదేహం


కారులో గాయపడిన శిరీష

వెల్దండ: తల్లి ఒడిలో హాయిగా నిద్రిస్తున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయింది. ప్రమాదంలో తల్లిదండ్రులు సైతం తీవ్రంగా గాయపడిన విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కొట్రగేట్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి కథనం ప్రకారం.. తెలకపల్లి మండలం నెల్లికుదురు గ్రామానికి చెందిన కోమల సాయి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటూ కారు క్యాబ్ డ్రైవర్ జీవనం సాగిస్తున్నారు. అయితే లింగాల మండలం అంబటిపల్లిలో బంధువుల వివాహం ఉండటంతో కారులో సాయితోపాటు భార్య శిరిష, వీరి కూతురు తేజశ్రీ (8నెలలు)తో కలిసి మంగళవారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో వెల్దండ సమీపంలోని వీజేఆర్ హోటల్ వద్ద కల్వకుర్తి వైపు ఇనుప సీకులు (చువ్వలు)తో వెళ్తున్న డీసీఎం ఎలాంటి సిగ్నల్ లేకుండా రోడ్డుపై నిలిపాడు. వెనుక నుంచి వచ్చిన కారు డీసీఎంను ఢీకొట్టడంతో అందులోని ఇనుప సీకులు చిన్నారి తలలోకి గుచ్చుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అలాగే భార్యాభర్తలు శిరీష, సాయి ఛాతీ భాగంలోకి ఇనుప చువ్వలు దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని సమీపంలోని యెన్నమ్స్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై పూర్తి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కొనసాగుతున్న అంజన్న బ్రహ్మోత్సవాలు


బీచుపల్లిలో ఆంజనేయస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ఇటిక్యాల: ఎర్రవల్లి మండలం బీచుపల్లిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 4వ రోజు మంగళవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, చౌకిసేవ, బలిహరణం తదితర పూజలు చేశారు. రాత్రి ప్రభోత్సవం కనులపండువగా సాగింది. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి మట్టి కుండల్లో ప్రత్యేక నైవేద్యం తయారుచేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పలువురు భక్తులు ధ్వజస్తంభం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటుచేసిన దుకాణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ఏటా మే నెలలో నాలుగు శనివారాల పాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుగుండా ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలకమండలి సభ్యులు అన్ని వసతులు కల్పించారు.


స్వామివారి ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీబీఎస్ఈ ఫలితాల్లో మౌంట్‌బాసిల్ విజయదుందుభి



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మౌంట్‌బాసిల్ పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో మహబూబ్‌నగర్ మౌంట్‌బాసిల్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పాఠశాల విద్యార్థులు ఎస్.సాయిశ్రీచరణ్ 492 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. చేతన్ 484, శ్రీనిత్య 480, వినయ్‌గౌడ్ 478, శివసాయిచరణ్ 477, సాయిచరణ్ 476 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో వందశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు అందుకు సహకరించిన తల్లిదండ్రులకు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ శిరీష ప్రవీణ్, పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్‌రెడ్డి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన 'సమర్థ' విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మహబూబ్‌నగర్ సమర్థ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థులు సుమన 96శాతం, అభినవ్‌సాయి 96, సయ్యద్ ఇసాముద్దీన్ 91, తైసిన్ తబసీన్ 90, సాత్విక్ 90, శరత్ చంద్ర 90, మహ్మద్ అబ్దుల్ మాలిక్ 89శాతం మార్కులు సాధించారు. సబ్జెక్టుల వారీగా తెలుగు 99శాతం, ఇంగ్లిష్ 98, హిందీ 97, మ్యాథ్స్ 97, సైన్స్ 94, సోషల్ 99, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీకాంత్ కోటా, డైరెక్టర్ నరేంద్రగుప్త అభినందించారు.

'ఎంవీ రామన్' జయకేతనం

ఆత్మకూర్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఆత్మకూర్ ఎంవీ రామన్ హైస్కూల్ విద్యార్థులు జయకేతనం ఎగరవేశారు. విద్యార్థులు సంస్కృతి 491, అభిగ్నసత్య 484, శ్రీరాంరెడ్డి 483, రాంచరణ్ 481, హర్షిత్ 480, కార్తిక్‌రెడ్డి 480, నవదీప్ 480, నరేశ్ 479, పవన్‌రెడ్డి 477, నవదీప్ 475, ప్రసన్న 475, సందీప్‌రెడ్డి 474 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అదే విధంగా 39 మంది విద్యార్థులు 90శాతం, 95మంది 80శాతం, 41మంది 70 శాతం, 13మంది 60 శాతం, ముగ్గురు 59శాతం మార్కులు సాధించారు. పాఠశాలలో100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ డా.మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్ విద్యార్థులను అభినందించారు.


స్వామినారాయణ గురుకుల్ ప్రతిభ

జడ్చర్ల టౌన్: సీబీఎస్‌సి ఫలితాల్లో జడ్చర్ల మండలం నాగసాల వద్ద ఉన్న స్వామి నారాయణ గురుకుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు ఇషాంక్ భరత్వాల్ 98.8 శాతంతో జిల్లా ప్రథమ స్థానం, సాయిచేతన్ 96.8 శాతంతో రెండవ స్థానంలో నిలిచినట్లు పాఠశాల యాజమాన్యం పూజ్య సర్వదర్శన్ దాస్‌జీ తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఏకలవ్య పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

వెల్దండ: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో వెల్దండ మండలం గుండాలలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 700 మార్కులకు గాను విద్యార్థి రాథోడ్ చరణ్ నాయక్ 625 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ పర్దీప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కాట్రావత్ చరణ్ 612, పాత్లావత్ కరణ్ నాయక్ 579, కొర్ర తరుణ్ 579 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

జీనుగరాల పెద్దగుట్టపై.. మధ్యయుగం నాటి రాతి చిత్రాలు


పెద్దగుట్టపై రథంతో పోలిన ఎర్రటి గీతలతో ఉన్న చిత్రం

దేవరకద్ర: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జీనుగరాల గ్రామంలోని పెద్దగుట్టపై తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు జరిపిన అన్వేషణలో 11వ శతాబ్దానికి చెందిన కొత్త రాతి చిత్రాలు వెలుగు చూశాయి. గత కొన్ని రోజులుగా తెలంగాణ కొత్త చరిత్ర బృందం సభ్యులు కావలి చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో జీనుగరాల పెద్దగుట్టపై జరిపిన అన్వేషణలో రాతిపై ఎర్రటి రంగులో చిత్రించిన చిత్రాలు బయటపడ్డాయి. ఇందులో కింది నుంచి పైకి ఒక రథంలా కనిపించే ఎరుపు గీతలలో మనిషి ఆకారం చతురస్రాకారంలో కనిపిస్తుంది. అలాగే తాబేలు, పక్కన నిచ్చెన వంటి నిలువు గీతలు ఉన్నాయి. వాటి చిత్రాలను తీసి చరిత్ర బృందం రాతి చిత్రాల నిపుణులు మురళీధర్‌రెడ్డి, కొత్త చిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్‌కు పంపించారు. వారు వీటిని పరిశీలించి చారిత్రక కాలానికి మధ్య యుగం నాటి రాతి చిత్రాలుగా గుర్తించారని చంద్రకాంత్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. బొమ్మ లోపల బొమ్మల వలె ఒక మనిషి నిలువ బొమ్మలో ఇవన్నీ గీసినట్లు కనిపిస్తుంది. ఇవి ప్రత్యేకంగా స్థానిక ప్రజలలో ఒకవర్గం వారి పూజాస్థానం అనిపిస్తుంది. ఈ రాతి చిత్రాల పరిసరాల్లో పురాతన మానవుల సమాధులు, ఆవాసాల జాడలున్నాయి. ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అన్వేషిస్తే మరిన్ని చరిత్ర పూర్వయుగ సంస్కృతులు తెలిసే అవకాశం ఉందని చంద్రకాంత్ తెలిపారు.